## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సైదాబాద్, ఏప్రిల్ 10: గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సైదాబాద్ కళ్యాణ్ నగర్ లోని మెడి ప్లేస్ హాల్ పై నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందించిన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వేణు మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్తీల్లో నివసించే పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం తమ వంతు సహాయం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో అవేర్ హాస్పిటల్ , పాణినీయ డెంటల్ హాస్పిటల్, అగర్వాల్ ఐ హాస్పిటల్ లకు చెందిన వైద్యులు పాల్గొని రోగులకు బీపీ, షుగర్ నేత్ర, దంత వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసర మైన వారికి ఉచితంగా మందులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపాయి ఫౌండేస్ చైర్మన్ నాగ మల్ల అనిల్ కుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సూర్య ప్రకాష్, ఆనంద్, శ్రీధర్, వైద్యులు డాక్టర్ కె వైష్ణవి, అనిలా, ఖతీజా జైన్, దారిత, శ్రీజ, సాయి, సాయిశ్రీ, ప్రణీత, తేజస్వి, అఖిల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫీజులు తగ్గించాలని విద్యార్థుల ధర్నా



ఎంవీఎస్ఆర్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్, ఏప్రిల్ 10: ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పెంచిన ఫీజులకు నిరసనగా ఇంజనీరింగ్ విద్యార్థులు ధర్నా చేశారు. ఇంటెన్షిప్ ప్లేస్ మెంట్ తీసుక రావటంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నాదర్ గుల్ లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు ఎలా పెంచుతారని విద్యార్థులు మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కళాశాల ఎదుట విద్యార్థులు ధర్నా చేశారు. కళాశాల యాజమాన్యం అన్ని రకాల ఫీజులు పెంచి పేద మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని మండి పడ్డారు. కళాశాల యాజమాన్యం కొన్ని సంవత్సరాలుగా ఇంటెన్షిఫ్, ప్లేస్ మెంట్ తీసుకరాక పోవటం వలన నానా ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేస్తామని కళాశాల యాజమాన్యం హామీ ఇవ్వటంతో ధర్నా విరమించినట్లు విద్యార్థులు తెలిపారు.

# ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీటి కష్టాలు..

- అరకొరగా నీటి సరఫరా
- ప్రభుత్వ వైఫల్యంతోనే నీటి కష్టాలంటున్న స్థానిక ప్రజలు



నీటి సమస్యపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వివరిస్తున్న స్థానికులు

ఆర్కే పురం, ఏప్రిల్ 10 : వేసవి తీవ్రత ప్రారంభంలోనే ఎన్టీఆర్ నగర్ ప్రాంతవాసులు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. తాగునీరు అరకొరగా అందుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం తెల్లవారుజాము నుంచే కుళాయి వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం తెల్లవారుజామునే లేచి కుళాయి వద్ద పడిగాపులు పడుతున్నా అరకొరగా వచ్చే నీటితో అంటే నాలుగు, ఐదు బిందెల నీరుతో సరి పెట్టుకోవాల్సి వస్తుందని ఆ ప్రాంతం మహిళలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో పుష్కలంగా తాగునీరు వచ్చేదని, కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో సరిపడ నీరందక అవస్థలు పడుతున్నామని స్థానికులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. జలమండలి కార్యాలయం కూత వేటు దూరంలో ఉన్నా తమకే ఇటువంటి పరిస్థితి ఉంటే మిగిలిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడే ఈ విధంగా ఉంటే రాబోయే మే నెలలో తాగునీటి కి మరింత ఇబ్బంది తప్పదని వారు ఆందోళన చెందుతున్నారు. సరిపడ నీటిని సరఫరా చేయాలని సంబంధిత జలమండలి అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తే ట్యాంకర్ల ద్వారా నీటిని సప్లై చేస్తామని చెప్పి తప్పించుకుంటున్నారని వాపోతున్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే నీటి సమస్య ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముందుచూపు లేకపోవడంతోనే తమ కాలనీలో నీటి సమస్య తలెత్తిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి సరఫరా చేసే సమయాన్ని పెంచి, నీటి ఎద్దడిని అరికట్టాలని కోరుతున్నారు. ఇదే విషయంపై జలమండలి డీజీఎం ని వివరణ కోరగా కొన్ని రోజులుగా పైనుంచే వాటర్ తక్కువగా వస్తోందని చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఎన్టీఆర్ నగర్లో నీటి సమస్య ను పరిష్కరిస్తామని డీజీఎం తెలిపారు.

### 20 నిమిషాలకు మించిరావు



తెల్లవారుజామునే లేచి తాగు నీటి కోసం పడిగాపులు పడినా 20 నిమిషాలకు మించి నీరు రావడం లేదు. వచ్చిన నీరు వంటలకు, ఇంట్లో వాడుకునేందుకు సరిపోవడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాగునీటి సమస్య ఉండేది కాదని, అప్పుడు లేని నీటి సమస్య ఇప్పుడు ఎందుకు ఏర్పడిందో తెలియటం లేదన్నారు.

– సుగుణమ్మ, స్థానిక మహిళ

## పార్కిన్సన్స్ వ్యాధితో పజలు అప్రమత్తంగా ఉండాలి

### కామినేని వైద్యులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 10: చేతులు, కాళ్లు వణుకుతూ మన శరీరంపై మనకే నియంత్రణ లేని పరిస్థితిని తీసుకువచ్చే ప్రమాదకరమైన పార్కిన్సన్స్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ కామినేని వైద్యులు డాక్టర్. ఎస్ రమేష్, డాక్టర్ ఎం. లక్ష్మీ లావణ్య సూచించారు. ప్రపంచ పార్కిన్సన్ డేను పురస్కరించుకొని ఎల్బీనగర్ కామినేని దవాఖాన ప్రాంగణంలోని ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్కిన్సన్స్ వ్యాధి ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారికి వచ్చే అవకాశం ఉందని, దీంతోపాటు కుటుంబంలో ఎవరికైనా ఉంటే జన్యుపరంగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. శరీరంలో ఉండే డోపమైన్ అనే రసాయనం ఉత్పత్తి తగ్గిపోయినప్పుడు పార్కిన్సన్స్ వ్యాధి మొదలవుతుందన్నారు. పార్కిన్సన్స్ వ్యాధి ప్రారంభ దశలో వణుకుడు, కదల లేకపోవడం, పడిపోతున్నట్లు అనిపించడం, చిన్నచిన్న అడుగులు వేయడం లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. సమయానికి డాక్టర్లను సంప్రదించినట్లయితే మాత్రలతోనే పార్కిన్సన్స్ వ్యాధిని నియంత్రించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమలేష్, డాక్టర్ సందీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




పార్కిన్సన్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మీ లావణ్య

# పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



హయత్ నగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏర్పుల నరసింహ, మహిళలు

హయత్ నగర్, ఏప్రిల్ 10 : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.నరసింహ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో హయత్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజల మీద మోయలేని భారం వేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అధిక భారం పడుతోందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ధరలని నియంత్రణ చేయలేని బీజేపీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు స్వరూప, అలివేల, రాజలక్ష్మి, పుష్ప,ఇందిరా, నాగరాణి, నిర్మలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి అబ్బాస్ అన్నారు. వంట గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ గురువారం సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐ ఎస్ సదన్ సంతోష్‌నగర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై మరో భారం మోపిందని, వంటగ్యాస్ సిలిండర్ ధరలను మళ్లీ పెంచిందని విమర్శించారు. గృహ అవసరాలు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ పై రూ.50 మేర పెంచిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్న సాధారణ ప్రజలపై మోడీ సర్కార్ వంటగ్యాస్ ధరలను పెంచి, కార్పొరేట్ సంస్థలకి లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ పై పెట్టిన సుంకాన్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు విఠల్, శ్రావణ్ కుమార్, మీనా, కిషన్, కృష్ణ, రాంకుమార్ నాయక్, జంగయ్య పాల్గొన్నారు.




సంతోష్‌నగర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం కార్యకర్తలు


## హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



హనుమాన్ యువ సేన ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్, ఏప్రిల్ 10: హనుమాన్ యువ సేన ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ గురువారం మోహన్ నగర్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ యువసేన అధ్యక్షుడు బొల్గం యశ్పాల్ గౌడ్ మాట్లాడుతూ, 13 సంవత్సరాల నుండి హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించడం జరుగుతోందన్నారు. 12 న సాయంత్రం ఐదు గంటలకు పూజా కార్యక్రమం, 6 గంటలకు హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ శోభాయాత్ర బాలాజీ నగర్ కాలనీ నుండి మోహన్ నగర్ చౌరస్తా మీదుగా కొత్త పేట్ గ్రామం, మహిళా భవన్ మీదుగా ఓల్డ్ మారుతి నగర్ చౌరస్తా జైన్ మందర్ ప్రాంతంలో హనుమాన్ టెంపుల్ నుండి బాబు కాంప్లెక్స్ , చైతన్యపురి రామాలయం దేవాలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ శోభాయాత్రలో యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్ ,వినోద్ కుమార్, వెంకటేష్, సంప్రీత్, విష్ణు, భావన్, వరుణ్ తరుణ్ ,రాజేష్ పాల్గొన్నారు.

## నేటి నుంచి సార్లరావులపల్లిలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



సార్లరావులపల్లిలో నిర్మించిన పెద్దమ్మ తల్లి దేవాలయం

కందుకూరు ,ఏప్రిల్ 10. మండల పరిధిలోని సార్లరావులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి , ధ్వజస్తంభ శిఖరా నూతన స్థిర విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ రజిత ప్రవీణ్ నాయక్ తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనెల 11వ తేదీ గణపతి పూజ, పుణ్యాహవాచనము, తోరణ బంధ, యాగశాల, అఖండ దీపారాధన , గణపతి హోమం, 12వ తేదీ ఉదయం పాతకాల మంటప పూజలు , హోమాలు, జలాధివాసం, మంగళ హారతి , తీర్థ ప్రసాదల వితరణ .13వ తేదీ పాతకాల పూజలు, యంత్ర ప్రతిష్ట ,విగ్రహ ప్రతిష్ట, మూర్తి హోమాలు , బలిహరణం, బింబ దర్శనం, గో దర్శనం, విగ్రహ దర్శనం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ట్రాన్స్ ఫార్మర్ పై కూలిన భారీ తాటి చెట్టు



వనస్థలిపురం స్నేహమయినగర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలి పడి ఉన్న భారీ తాటి చెట్టు

వనస్థలిపురం, ఏప్రిల్ 10 : గురువారం సాయంత్రం వచ్చిన గాలి దుమారానికి ఓ తాటి చెట్టు కూలి ట్రాన్స్ ఫార్మర్ పై పడిన సంఘటన వనస్థలిపురంలో చోటు చేసుకుంది. బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ లోని స్నేహమయి నగర్ కాలనీలో ఈ సంఘటన జరిగింది.ట్రాన్స్ ఫార్మర్ కు కొద్ది దూరంలో ఉన్న తాటి చెట్టు భారీ గాలి దుమారానికి ఒరిగి ట్రాన్స్ ఫార్మర్ పై కూలింది. ఈ సంఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విరిగిపడిన తాటి చెట్టు కరెంటు తీగలపై ఒరిగి ఉండడంతో అటు నుంచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సంఘటనతో స్నేహమయి నగర్ సమీపంలోని సుమారు 20 కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓవైపు గాలి మరోవైపు చిన్నచిన్నగా వర్షం పడుతుండడంతో ఏమి చేయలేని స్థితిలో డీఆర్ఎఫ్ బృందం వేచి చూసింది. కాగా వెంటనే స్పందించాల్సిన డిజాస్టర్ టీం, జీహెచ్ఎంసీ అధికారులు, విద్యుత్ అధికారులు ఆ స్థాయిలో స్పందించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

### గతంలోనే ఫిర్యాదులు

స్నేహమయినగర్ కాలనీలో తాటి చెట్టు ప్రమాద భరితంగా ఉందని గతంలోనే స్థానికులు ఫిర్యాదులు చేశారు. జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖకు, ప్రజా ప్రతినిధులకు గతంలోనే ఫిర్యాదులు చేశారు. తాటి చెట్టు రోడ్డుపైకి, ట్రాన్స్ ఫార్మర్ పైకి వంగి ఉందని, ఇది ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, దాన్ని తొలగించాలని ఫిర్యాదుల అందినా అధికారులు కనీసం పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సాహెబ్ నగర్ శివారులో ప్రమాద భరితంగా ఉన్న చెట్లను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## హోమియోపతిపై ప్రజల్లో ఆదరణ

**రామంతాపూర్:**రామంతాపూర్ ప్రభుత్వ హోమి యో పతి కళాశాలలో గురువారం ప్రపంచ హోమియో పతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న శ్యాముల్ హనిమన్ విగ్రహానికి ఆయుష్ డైరెక్టర్ కె. హైమవతి, కేఎన్ఆర్ యునివర్సిటీ వైస్ చాన్సలర్ నందకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచార్యులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ లింగరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పూల్మమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హోమియో వాక్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. హోమియో కళాశాలకు విస్తృతంగా సేవలందించిన డాక్టర్ సోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హోమియో పతి వైద్య పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలోఎన్ఎస్ ఎస్ కోర్డినేటర్ డాక్టర్ పార్థసారిధి, ఫార్మసి సిబ్బంది, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తగా మారం



మారం సుజాత రెడ్డి

ఆర్కే పురం, ఏప్రిల్ 10 : ఆర్కే పురం డివిజన్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తగా మారం సుజాత రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేవాలయ అభివృద్ధికి పాలకవర్గంతో కలిసి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. దైవ సేవ చేయడానికి ధర్మకర్తగా తనకు మరోసారి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యత కు తగిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

## మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రభుత్వం కృషి



తిమ్మాపూర్ లో మాట్లాడుతున్న జంగారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 10 .ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం కడుపు కోవాలని చూస్తున్నారని రంగారెడ్డి జిల్లా జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి తెలిపారు .జై భారత్ ,జై భీమ్, జై సవిధాన్ కార్యక్రమాలలో భాగంగా మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మార్కెట్ యార్డ్ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి , ఇన్చార్జి పెంటా రెడ్డిలతో కలిసి మాట్లాడుతూ, ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోందని, ఆ కుట్రలను తిప్పి కొట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ ఎండి అఫ్జల్ బేగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సొడపు వెంకటేష్ గౌడ్, అందుగుల సత్యనారాయణ, మూల హనుమంతు రెడ్డి , సరికొండ జగన్ , ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, అజీజ్, నరసింహ చారి , బుక్క పాండురంగారెడ్డి , డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ ,వరికు,ప్పల బాబు , కుమార్, శేఖర్ యాదగిరి మంద సాయిలు, శ్రీకాంత్, వెంకటేష్, ముదిరాజ్ పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాల నిర్వహణ అభినందనీయం



మెగా రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీఎస్ అడిషనల్ డీసీపీ గాదరి మనోహర్, చేపూరి శంకరయ్య, తదితరులు

వనస్థలిపురం, ఏప్రిల్ 10 : తల సేమియా రోగుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని సీసీఎస్ హైదరాబాద్ అడిషనల్ డీసీపీ గాదరి మనోహర్ అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే 198వ జయంతి సందర్భంగా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల సేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ఎంతో అవసరం అన్నారు, వారికి సమాజమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ట్రస్ట్ చైర్మన్ చేపూరి శంకరయ్య మాట్లాడుతూ, రక్తదానం చేయడం ప్రాణదానం చేయడంతో సమానం అన్నారు. తమ శిబిరాలకు స్పందించి రక్తదానం చేస్తున్న యువకులకు, పుర ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, కృష్ణ, సుధాకర్ శర్మ, బాలరాజు, సంజయ్ కుమార్, కొంగరి నరసింహ, చేపూరి సునీత, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం: కొప్పుల

మన్సురాబాద్, ఏప్రిల్ 10: రోజురోజుకు పెరుగుతున్న ఎండల ను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ ఆటోనగర్ లోని పారిశ్రామికవాడలో ది హైదరాబాద్ ఆటోనగర్ మెకానికల్, టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వందలాదిమంది కార్మికులు పని చేసే ఆటోనగర్ పారిశ్రామిక వాడలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అసోసియేషన్ సభ్యులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో సామాజిక సేవలను చేయడం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండా కృష్ణ, సభ్యులు జగన్, రవికుమార్, సత్యనారాయణ, బాలకృష్ణ, బాబా నాయకులు వెంకటరమణ, పాతూరి శ్రీధర్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ పారిశ్రామికవాడలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

## వివాహిత అదృశ్యం



గొడ్డేటి సంతోష

హయత్ నగర్, ఏప్రిల్ 10 : ఇంటి నుండి వెళ్లిన ఓ మహిళా అదృశ్యమైన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...హయత్ నగర్ లోని శంకర్ నగర్ కాలనీలో నివససిస్తున్న గోడ్డేటి సంతోష , గోడ్డేటి రాజు దంపతులకు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఈ నెల 8న ఉదయం 7 గంటలకు గోడ్డేటి సంతోష, భర్త గోడ్డేటి రాజుతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కోపం తగ్గిన తర్వాత భార్య తనే తిరిగి వస్తుందని ఎదురు చూశాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గుర్కైన భర్త, భార్య ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గ్యాస్ సిలిండర్ బ్లాస్ట్



సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పహాడి షరీఫ్, ఏప్రిల్ 10: సిలిండర్ పేలి ఇళ్లు దగ్ధమైన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాధత్ నగర్‌లోని సల్మా భాను ఇంటికి గురువారం గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ చేశారు. ఇంటి బయటే గ్యాస్ సిలిండర్ ను స్టోర్ చేశారు. కానీ ఎండల వేడిమి.. గ్యాస్ లీకేజీ కారణంగా ఆకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. దీనితో ఇల్లు పా క్షికంగా ధ్వంసమైంది. ప్రమాదాన్ని గ్రహించిన స్థానికులు సల్మా భానును కాపాడుతూ మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అనంతరం ప్రమాద ఘటనపై అగ్ని మాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. చిన్నారులు స్కూల్ కి, కుటుంబ సభ్యులు వారి వారి విధులకు వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

## 26 వరకు దరఖాస్తులు స్వీకరణ

ఆర్కే పురం, ఏప్రిల్ 10 : మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో మూతపడిన బార్ స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు ఆసక్తి గల దరఖాస్తుదారుల నుండి ఈ నెల 26 వరకు అన్ని కార్యాలయ పని దినాలలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సరూర్‌నగర్ కార్యాలయం నందు స్వీకరించనున్నట్లు సరూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తుతో పాటు లక్ష రూపాయల చలాను, డీడీ సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాల కోసం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ సరూర్‌నగర్ నందు సంప్రదించాలని కోరారు.